సాక్షి
వైఎస్సార్ జిల్లా
ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024



జిమ్నాస్టిక్స్ జట్లు ఎంపిక

కడప నగరంలోని వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి జిమ్నాస్టిక్స్ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. -8లో



అఘాయిత్యాల నిరోధానికి చర్యలు

నిమ్న వర్గాల ప్రజలపై వివక్ష, అఘాయిత్యాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. -8లో

గరిష్టం/కనిష్టం
34.2/26.6

వాతావరణం

జిల్లాలో శనివారం 26.6 – 34.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.0 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

సెలవు రోజూ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కడప కార్పొరేషన్: జిల్లాలో ఆదివారం సెలవు రోజూ విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయని విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అన్ని వసూలు కేంద్రాలు పనిచేస్తాయని పేర్కొన్నారు. అలాగే ప్రతి మండలంలోని పల్లెలకు తమ విద్యుత్ సిబ్బంది కరెంటు బిల్లులు వసూలు చేసేందుకు వస్తారని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బిల్లులు చెల్లించాలని కోరారు.

ట్యాలీలో ఉచిత శిక్షణ, ఉపాధి

కడప కోటిరెడ్డిసర్కిల్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగుళూరు నగరంలో కంప్యూటర్ అండ్ ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణతోపాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఫౌండేషన్ అడ్మిషన్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాస్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన అభ్యర్థులు 18 నుంచి 28 ఏళ్ల లోపు కలిగి ఉండాలన్నారు. 35 రోజులపాటు కొనసాగే శిక్షణా కాలంలో ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌లో శిక్షణ ఇస్తారన్నారు. పూర్తి వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలన్నారు.

3 నుంచి ఏపీ టెట్ పరీక్ష

కడప ఎడ్యుకేషన్: ఏపీ టీచర్ ఎలిజిబిలిటి టెస్టు (కంప్యూటర్ బేస్డ్)ను అక్టోబర్ 3 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధ తెలిపారు. ఇందుకోసం జిల్లాలో 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. ఈ పరీక్ష ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో ఉంటుందని తెలిపారు. ఉదయం సెషన్ 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ 2.30 గంటల నుంచి 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను http://aptet.apcfss.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9441557508, 9866041341 నెంబర్‌లకు కాల్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవాలని డీఈఓ అనురాధ తెలిపారు.

నేడు ఉర్దూ జిల్లా కాన్ఫరెన్స్

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ కడపజిల్లాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం కడప నగరపాలక ఉర్దూ ఉన్నత పాఠశాలల్లో జిల్లా ఉర్దూ కాన్ఫరెన్స్‌ను నిర్వహిస్తున్నట్లు రూట జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ ఇర్షాద్, జాకీర్‌హుస్సేన్ తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఉర్దూ విద్యారంగాన్ని పటిష్టపరచాల్సిన అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రూట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ హాజరువుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఉర్దూ ఉపాధ్యాయులందరూ హాజరుకావాలని వారు పిలుపునిచ్చారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగాలు

వేంపల్లె: ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఉద్యోగాలు లభించినట్లు డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా తెలిపారు. సీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు జోరింట్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 11 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. వీరికి రూ 5.50లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు కల్పించామన్నారు. తమ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడంపై ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్ సంద్ర, డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి రవికుమార్ అకాడమిక్ డీన్ రమేష్ కైలాష్, ప్లేస్మెంట్ కో–ఆర్డినేటర్ వినోద్ హర్షం వ్యక్తం చేసి విద్యార్థులను అభినందించారు. ట్రిపుల్ ఐటీలు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

దేవ దేవా... బాబు కళ్లు తెరిపించు!

- జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో వైఎస్సార్‌సీపీ నేతల ప్రత్యేక పూజలు
- తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ పేరుతో కూటమి నేతల డ్రామాలపై మండిపాటు
- కుట్రలు, కుయుక్తులు, అసత్య ప్రచారంపై వైఎస్సార్ సీపీ ధర్మ పోరాటం



దేవునికడప ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి తదితరులు



ప్రొద్దుటూరు ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో హారతి ఇస్తున్న రాచమల్లు



మైదుకూరు మున్సిపాలిటీలోని ఎల్లంపల్లె తిరుమలనాథ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

సాక్షి రాయచోటి/సాక్షి కడప: ముఖ్యమంత్రి బాబుకు మంచి బుద్ధి ప్రసాదించు స్వామీ అంటూ వైఎస్సార్ సీపీ నేతలు ఆ దేవ దేవున్ని వేడుకున్నారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ప్రసాదమైన లడ్డూలో కల్తీ జరగకపోయినా జరిగినట్లు విష ప్రచారం చేస్తున్న చంద్రబాబు కళ్లు తెరిపించేలా చూడు దేవా.. అంటూ జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన రాజకీయ లబ్ధి కోసం ... ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీపై రాజకీయ దుర్బుద్ధితో దుష్ప్రచారానికి ఒడికట్టిన బాబు తీరుపై ఆ పార్టీ నేతలు ధర్మ పోరాటానికి దిగారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలు, కుతంత్రాలను తిప్పికొడుతూ సత్యమేవ జయతే అంటూ ప్రజలకు వివరించారు. శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ నేతలు ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ధర్మ పరిరక్షణలోనూ....తిరుమల పవిత్రతను కాపాడటంలోనూ వైఎస్సార్ సీపీ సర్కార్ ఏనాడూ వెనుకంజ వేయలేదని...ఎన్నో దైవ కార్యాలు జగన్ సర్కార్‌లోనే చేపట్టిన విషయాలను గుర్తు చేశారు. కూటమి సర్కార్‌పై జరుగుతున్న ఈ ధర్మయుద్ధంలో పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపుమేరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశాయి.

ఇరు జిల్లాల ఆలయాల్లో ప్రత్యేక పూజలు

వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడపలోని దేవునికడప ఆలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్ బాషా, నగర మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి తదితరులు వెంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. కూటమి నేతలకు మంచి బుద్ధి ప్రసాదించేలా చూడాలని కోరుకున్నారు.

- రాజంపేటలోని ఎల్లమ్మ ఆలయంలో అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే నందలూరులోని ముత్తుమారెమ్మ ఆలయంతోపాటు ఒంటిమిట్ట శ్రీకోదండ రామస్వామి ఆలయంలోనూ జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డితో కలిసి ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పూజలు నిర్వహించారు.
- బద్వేలులోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అదే నియోజకవర్గలలోని అట్లూరు మండలం రెడ్డిపల్లిలో పోలేరమ్మ తల్లికి విశేష పూజలు నిర్వహించారు. పోరుమామిళ్లలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ గోవిందరెడ్డి పూజలు నిర్వహించారు.
- ప్రొద్దుటూరులోని బొల్లవరంలోగల శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చంద్రబాబు గతంలో చెప్పులు వేసుకుని వెంకటేశ్వరస్వామి పటాన్ని పట్టుకున్న ఫొటోను చూపుతూ ప్రత్యేకంగా కనిపించారు.
- మైదుకూరులో సమీపంలోని ఎల్లంపల్లి గ్రామం వద్ద తిరుమలనాథస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, రాష్ట్ర నాయకులు రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, రామ గోవిందరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- ఎర్రగుంట్ల మండలం చిలంకూరులోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, తిరుపతిలో ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.
- పులివెందులలోని పాత బస్టాండులో ఉన్న వెంకటరమణ స్వామి ఆలయంలో మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి టెంకాయలు సమర్పించారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె, వైఎస్సార్ జిల్లా కమలాపురం ప్రాంతాల్లో పలువురు మండల నేతలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆలయాల్లో పూజలు నిర్వహించాయి.
- రైల్వేకోడూరులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.
- పీలేరు నియోజకవర్గం వాల్మీకిపురం పట్టాభి రామాలయంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.
- మదనపల్లెలోని ప్రసన్న వెంకట రమణ ఆలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిసార్ అహ్మద్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.
- రాయచోటి నియోజకవర్గంలోని సంబేపల్లెలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, చిన్నమండెంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథ రెడ్డి, లక్కిరెడ్డిపల్లెలో ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డిల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.



పూజల అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



నందలూరు: మారెమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి



ఎర్రగుంట్ల: చిలుంకూరు వేంకటేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న సుధీర్ రెడ్డి



పులివెందులలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న వైఎస్ మనోహర్ రెడ్డి తదితరులు



రైల్వేకోడూరు ప్రసన్నవెంకటేశ్వరస్వామి ఆలయంలో కొరముట్ల పూజలు

పాప ప్రక్షాళన జరగాలి

- వంద రోజుల పాలనను మరిపించడానికి డైవర్షన్ పాలిటిక్స్
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి మహాప్రసాదంపై నిందలేసిన వారందరిని దేవుడు శిక్షిస్తాడని, పాప ప్రక్షాళన జరిగి తీరుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం తిరుమల తొలిగడప దేవునికడప ఆలయంలో రవీంద్రనాథ్‌రెడ్డితోపాటు మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో దుష్ట, దుర్మార్గ పాలన సాగుతోందని, రెడ్ బుక్ రాజ్యాంగం నడుపుతూ...వంద రోజుల అసమర్థ పాలనను మరిపించడానికి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక చంద్రబాబు తన ప్రచార యావతో పుష్కరాల్లో 30 మందిని పొట్టనబెట్టుకున్నారని, దేవుడంటే భక్తి, భయం కూడా చంద్రబాబుకు లేవని, అనేక దేవాలయాలను కూల్చి మహాపరాధం చేశారన్నారు. 2024లో మళ్లీ అధికారంలోకి వచ్చాక తిరుమల మహాప్రసాదంపై ప్రజల్లో అనుమాన బీజాలు నాటారన్నారు. లడ్డూ విషయంలో తప్పు చేశామని తెలుసుకొని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మతం గురించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బ్రిటీష పాలనలో, ముస్లిం రాజుల పాలనలో కూడా దేవాలయాల్లోకి వెళ్తుంటే అడ్డుకున్న దాఖలాలు లేవన్నారు. తిరుమలకు వెళ్లకుండా వైఎస్సార్‌సీపీ నాయకులకు నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు.

ఆంధ్రప్రదేశ్ పరువు తీశారు: మేయర్

తిరుమల లడ్డూపై నిందలేసి ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రం పరువు తీశారని మేయర్ సురేష్ బాబు అన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా అట్టర్‌ఫ్లాప్ అయిన పాలననుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు దేవుని పైనే రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

హిందూవుల మనోభావాలు దెబ్బతీసిన సీఎం: మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

తిరుమల మహాప్రసాదంపై ఆరోపణలు చేయడం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు హిందువుల మనోభావాలు దెబ్బతీశారని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. ఏపీలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అమలు కావడం లేదని, రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందన్నారు. బాబు తన రాజకీయాల్లోకి దేవుడిని కూడా లాగడం నీచమన్నారు. ప్రజల శ్రేయస్సు కోరి వైఎస్ జగన్ తన పర్యటన వాయిదా వేసుకున్నారని తెలిపారు. జగన్ తిరుమలకు వస్తే డిక్లరేషన్ ఇవ్వాలని కూటమి నాయకులు కోరడం దారుణమన్నారు. తప్పు చేసిన చంద్రబాబుకు దేవుడు శిక్షిస్తాడన్నారు.

దేవుడిని రాజకీయాల్లోకి లాగడం మంచిది కాదు: ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

తిరుమల వెంకటేశ్వరస్వామిని రాజకీయాల్లోకి లాగడం మంచిది కాదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు. చంద్రబాబు వ్యాఖ్యల వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని, ఈ పాపం ఊరికే పోదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, బీహెచ్ ఇలియాస్, పులి సునీల్, బంగారు నాగయ్య యాదవ్, దాసరి శివప్రసాద్, సీహెచ్ వినోద్, రమేష్‌రెడ్డి, జాషువా, కె బాబు, చెన్నయ్య, తోటక్రిష్ణ, సంపత్, రామక్రిష్ణ, రాజగోపాల్‌రెడ్డి, మహిళా నేతలు పత్తిరాజేశ్వరి, రత్నకుమారి, సునీత, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విజన్‌లో భాగస్వాములు కావాలి

కలెక్టర్ శివశంకర్

కడప సెవెన్‌రోడ్స్: యువత, విద్యార్థులు స్వర్ణాంధ్ర–2047 విజన్‌లో భాగస్వాములు కావాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి కోరారు. శనివారం పబ్లిక్ గ్రీవెన్స్ హాలులో స్వర్ణాంధ్ర విజన్–2047పై నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు. జిల్లాలో సెప్టెంబర్ 26 తేదీన పాఠశాల క్లస్టర్ స్థాయిలో, సెప్టెంబర్ 27వ తేదీన మండల స్థాయిలో విజన్ స్వర్ణ ఆంధ్ర–2047పై వ్యాసరచన, వక్తృత్వం, డిబేటింగ్‌ల మీద విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో మొదటి స్థానంలో వచ్చిన విద్యార్థులకు సెప్టెంబర్ 28 తేదీన మున్సిపల్ హైస్కూల్ గాంధీనగర్‌లో జిల్లా స్థాయి పోటీలను నిర్వహించారు.

వ్యాసరచన పోటీల విజేతలు

వ్యాసరచన పోటీల్లో మొదటి స్థానం యుసన (మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల ఉన్నత పాఠశాల ,వనిపెంట), రెండవ స్థానం చిన్నరాయుడు (జెడ్పీ హైస్కూల్,భాకరాపేట), మూడవ స్థానం జి.విష్ణు ఉజ్వల (ఏపీఆర్ఎస్ గర్ల్స్ మైలవరం) నిలిచారు. వక్తృత్వ పోటీల్లో మొదటి బహుమతి సాయి శరణ్య (జెడ్పీ హైస్కూల్, న్యూ మాధవరం), రెండవ బహుమతి జాహ్నవి (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గర్ల్స్, వేంపల్లె), మూడవ బహుమతి సుదర్శిత సాయి తేజ (ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఖాజీపేట) దక్కించుకున్నారు. డిబేటింగ్ పోటీలలో మొదటి స్థానంలో మేఘన, ఎస్.షణ్ముఖ ప్రియా (ఏపీ ఆర్ఎస్ మైలవరం), ద్వితీయ స్థానంలో వి.దీపిక (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సీకే దిన్నె), భాను ప్రకాష్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగడి వీధి), తృతీయ స్థానంలో బిందులత (జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, పులివెందుల) గౌరీ శంకర్ (గవర్నమెంట్ హై స్కూల్ అహోబిలాపురం, పులివెందుల) నిలిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం అనురాధ, డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్లు, కడప మండల విద్యాశాఖ అధికారి, సెక్టోరియల్ అధికారులు, న్యాయ నిర్ణేతలు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



విజేతలైన బాలికలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి జిమ్నాస్టిక్స్ జట్లు ఎంపిక



జిమ్నాస్టిక్స్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి జిమ్నాస్టిక్స్ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించిన ఎంపికలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని క్రీడలకు మూల క్రీడలాంటి జిమ్నాస్టిక్స్ సాధన చేయాలంటే కఠోర సాధన అవసరమన్నారు. కార్యక్రమంలో జిమ్నాస్టిక్స్ శిక్షకుడు తమీమ్ అన్సారీ, అర్షద్, అలీం, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టిస్టిక్ విభాగంలో ఎంపికైన క్రీడాకారులు

అండర్-14 బాలురు : బి. నితిన్‌రెడ్డి, ఎస్. వెంకటకిశోర్, ఎన్. వెంకటసాయికుమార్, హెచ్.మనోజ్, పి. ఫర్హతుల్లాఖాన్, పి. ధనుష్, టి. సాకేత్.

అండర్-17 బాలురు : వై.శశాంక్, కె. వరుణ్‌తేజ, కె. మధుకర్, ఎస్. గౌతమ్‌పవన్, ఎ. అశ్వంత్‌రెడ్డి, ఎ. ఆర్యన్.

అండర్-14 : వై. కిరణ్మయి, బి. జ్యోతి, డి. అశ్విని, ఓ. అనూష, ఎం. రాగదివ్య.

అండర్-17 బాలికలు : కె. రజిత, సి.హెచ్. జ్యోతిక, ఎస్. ప్రవల్లిక, సి. జాహ్నవి, డి. లక్ష్మి.

రిథమిక్ విభాగం..

అండర్-14 బాలికలు : ఎం. స్రవంతి, సి.మీనాక్షి, ఎం.వి. ఆధ్య, ఎస్.హారిక.

అండర్-17 బాలికలు : ఓ. వాణి, జె.సనా, ఎస్. యుహన, జి.సౌధ.

భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

కలెక్టర్ శివశంకర్ లోతేటి



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి , చిత్రంలో జేసీ, డీఎఫ్‌ఓ, డీఆర్‌ఓ

కడప సెవెన్‌రోడ్స్ : జాతీయ రహదారుల అభివృద్ధి పనుల్లో భాగంగా జిల్లాలో చేపడుతున్న భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి సంబంధిత అధికారులను ఆదేశించారు.

శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారుల అభివృద్ధి పనుల భూ సేకరణపై జేసీ అదితి సింగ్, డీఎఫ్‌ఓ సందీప్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే ప్రక్రియలో భాగంగా రహదారులను విస్తృత పరిచి రవాణా వ్యవస్థను మరింత సులభతరం చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా జిల్లా మీదుగా వెళ్తున్న జాతీయ రహదారులు, రైల్వే లైన్ల నిర్మాణం, వాటి అభివృద్ధికి అదనంగా చేపడుతున్న భూసేకరణ పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ ప్రక్రియలో ఫారెస్ట్, పర్యావరణ, కోర్టు సంబంధిత అంశాలు, అభ్యంతరాలు ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారులు, రైల్వే, ఇరిగేషన్, ట్రాన్స్‌కో, భూగర్భ జల శాఖల అధికారులు రెవెన్యూ అధికారులను సమన్వయం చేసుకుంటూ నిర్దేశించిన గడువు లోపు భూసేకరణ పనులను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. అలాగే అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలో భూసేకరణ పెండెన్సీపై సమీక్షించారు. అంతేకాకుండా అన్ని రెవెన్యూ డివిజన్ల పరిధిలోని ఆయా ఆర్డీఓలు భూసేకరణ పెండింగ్ పనులను పునః పరిశీలించి వచ్చే సమావేశంలో సాధ్యాసాధ్యాల నివేదికలను సమర్పించాలన్నారు. జాతీయ రహదారుల అభివృద్ధికి సంబంధించి జిల్లా పరిధిలో ఎలాంటి పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జేసీ అదితి సింగ్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారుల అభివృద్ధి పనులు, భూసేకరణ పనుల పెండింగ్, ఇప్పటికే రిలీజ్ చేసిన అవార్డు వివరాలను జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో కడప, బద్వేలు, పులివెందుల ఆర్డీఓలు వెంకటపతి, చంద్రమోహన్, ఎన్‌హెచ్‌ఏఐ కడప, తిరుపతి, నెల్లూరు పీడీలు బి. అశోక్ కుమార్, గోపీకృష్ణ, సుదర్శన్ కుమార్, ఆయా మండలాల తహసీల్దార్‌లు తదితర అధికారులు పాల్గొన్నారు.

ట్రెజరీ జూనియర్ అసిస్టెంట్ అదృశ్యం



విష్ణువర్ధన్ రెడ్డి (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరం ఎర్రముక్కపల్లిలో నివాసం ఉంటూ అన్నమయ్య జిల్లా రాజంపేటలోని సబ్ ట్రెజరీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి ఈనెల 23 నుంచి కనిపించడంలేదని భార్య బేబీ షామిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప వన్ టౌన్ సీఐ బి. రామకృష్ణ తెలిపారు. రోజూ కడప నుంచి రాజంపేటకు విధులకు వెళ్లేవాడు. ఈనెల 23న ఇంటివద్ద నుంచి వెళ్లి అదృశ్యమయ్యాడు. ఇంటిలో తన పైఅధికారుల వేధింపులు తట్టుకోలేకున్నానని నోటు రాసి వెళ్లినట్లుగా భార్య తమ ఫిర్యాదులో పేర్కొన్నారు.

నిమ్న వర్గాలపై అఘాయిత్యాల నిరోధానికి చర్యలు

జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో డీఆర్‌ఓ గంగాధర్ గౌడ్

కడప సెవెన్‌రోడ్స్ : నిమ్న వర్గాల ప్రజలపై వివక్ష, అఘాయిత్యాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) గంగాధర్ గౌడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ మీటింగ్ హాలులో ఆయన అధ్యక్షతన సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రొద్దుటూరు డీఎస్పీ భక్తవత్సలం, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకి సంబంధించిన కేసులలో బాధితులకు న్యాయంతో పాటు త్వరితగతిన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే వారికి సంబంధించిన భూ సమస్యలు ఏమైనా ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని కమిటీ సభ్యులైన అధికారులను ఆదేశించారు. సామాజిక రుగ్మతలను దూరం చేసి అన్ని వర్గాల ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ చేపడుతున్న చర్యలపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని అట్రాసిటీ కేసులు నమోదు కాకుండా అవగాహన పెంచాలన్నారు. సమాజంలో నేరాలను తగ్గించేలా, అట్రాసిటీ చర్యలకు పాల్పడితే పడే శిక్ష, కేసులు, సెక్షన్లు తదితర అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు.

దళితులకు ఎక్కడా అన్యాయం జరగకూడదని, జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా పారదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. ఈ అంశంలో ప్రత్యేక శ్రద్ధ వహించి బాధితులకు పరిహారం అందేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప, బద్వేలు, పులివెందుల డివిజన్ల ఆర్డీఓలు వెంకటపతి, చంద్రమోహన్, వెంకటేష్, సంబంధిత డీఎస్పీలు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, ఎల్డీఎం జనార్దన్, కమిటీ సభ్యులైన సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో మైదుకూరు విద్యార్థినికి ప్రథమ స్థానం



కలెక్టర్ శివశంకర్ నుంచి ప్రశంసాపత్రం, నగదు బహుమతిని అందుకుంటున్న విద్యార్థిని సనా

మైదుకూరు : స్వర్ణాంధ్ర -2047పై కడపలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో మైదుకూరు విద్యార్థిని యు.సనా మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఎంఈఓ పద్మలత తెలిపారు. విజన్ ప్లాన్ స్వర్ణాంధ్ర-2047లో విద్యార్థుల పాత్ర అనే అంశంపై మండల స్థాయిలో శుక్రవారం నిర్వహించిన పోటీలో సనా మొదటి స్థానంలో నిలిచింది. జిల్లా స్థాయి పోటీకి ఎంపికైన మండలంలోని వనిపెంట జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన ఈ విద్యార్థిని అక్కడ కూడా మొదటి స్థానం సంపాదించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. కలెక్టర్ శివశంకర్ లోతేటి విద్యార్థిని సనాకు ప్రశంసా పత్రం, నగదు బహుమతిని అందజేసి అభినందించారు. తమ పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల బీసీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల, అధ్యాపకులు విద్యార్థినిని అభినందించారు.

కారును ఢీకొన్న లారీ



ప్రమాదంలో దెబ్బతిన్న కారు



బోల్తాపడిన లారీ

ఒంటిమిట్ట(సిద్దవటం) : మండల పరిధిలోని మంగంపేట గ్రామ శివారులో శనివారం కారును లారీ ఢీకొంది. మైదుకూరుకు చెందిన నలుగురు వ్యక్తులు ఇన్నోవా కారులో శ్రీకాళహస్తికి బయలుదేరారు. ఈ క్రమంలో తిరుపతి నుంచి మహారాష్ట్రకు వెళుతున్న లారీ మంగంపేట గ్రామ శివారులోకి రాగానే కారును ఢీకొంది. కారు ముందు వైపు పూర్తిగా దెబ్బతినింది. లారీ బోల్తా పడింది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఆరేళ్ల బాలికపై అత్యాచారయత్నం

చక్రాయపేట : మండలంలోని నెరుసుపల్లె గ్రామం అప్పిరెడ్డిగారిపల్లికు చెందిన ఆరేళ్ల బాలికపై శివాజీ అనే యువకుడు అత్యాచార యత్నం చేసినట్లు సీఐ నాగరాజు తెలిపారు. సెల్‌ఫోన్ చూపిస్తానని ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని చిన్నారి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం కడప రిమ్స్‌కు పంపినట్లు ఆయన తెలిపారు.

కేసీ కాలువలో పడి వ్యక్తి మృతి

ఖాజీపేట : రెండు రోజుల నుంచి కనిపించకుండా ఉన్న వ్యక్తి కేసీ కాలువలో మృతదేహమై కనిపించాడు. వివరాలు ఇలా.. కూనవారిపల్లె గ్రామానికి చెందిన కల్లూరు నాగేంద్ర (46) తనకు ఉన్న 75 సెంట్ల స్థలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో గురువారం నుంచి కనిపించకుండా పోయాడు. బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే సీతానగరానికి అనుకుని ఉన్న కేసీ కాలువలో మృతదేహాన్ని శనివారం ఉదయం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. చనిపోయిన వ్యక్తి కల్లూరు నాగేంద్రగా గుర్తించారు. వెంటనే పోలీసులు సమాచారం ఇవ్వడంతో ఖాజీపేట సీఐ మోహన్ మృతదేహాన్ని వెలికి తీయించారు. మద్యం మత్తులో కాలువలో పడి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు.

ఒకే కుటుంబంలో విషాదం

కల్లూరు వెంకటసుబ్బయ్య రోడ్డు ప్రమాదంలో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. శనివారం అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ బాధ నుంచి తేరుకోకముందే కల్లూరు వెంకటసుబ్బయ్య అన్న కుమారుడు కల్లూరు నాగేంద్ర కాలువలో పడి చనిపోయిన సంఘటన కుటుంబ సభ్యులను కలచి వేసింది. కేవలం ఒక్క రోజు వ్యవధిలోనే ఇద్దరిని మృత్యువు కబళించడంతో ఆ కుటుంబ శోకసంద్రంలో మునిగిపోయింది.

నీటి గుంతలో పడి..



మృతుడు శ్రీనివాసులురెడ్డి

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి మండలం చాబలి గ్రామ సమీపంలో ఉన్న బేనిటా మైన్స్ నీటి గుంతలో పడి శనివారం వేంపల్లె గ్రామానికి చెందిన ఎం.శ్రీనివాసులురెడ్డి(36) మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... శ్రీనువాసులురెడ్డి పెండ్లిమర్రి మండలం బుద్దాయపల్లె గ్రామంలో అత్తగారి ఇంటి వద్ద రెండేళ్ల నుంచి కాపురం ఉంటున్నాడు. రోజు మాదిరిగానే ఉదయం పశువులను మేపుకునేందుకు మైన్స్ పక్కకు వెళ్లాడు. పశువులు నీటి కోసం గుంత వద్దకు వెళ్లడంతో పశువులను తోలుకుని వచ్చేందుకు నీటిలోకి దిగాడు. ప్రమాదవశాత్తు గుంత నీటిలో పడ్డాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. శ్రీనివాసులురెడ్డి ఇంటికి ఎంత సేపటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా మైన్స్ నీటి గుంత వద్ద పాదరక్షలు కనిపించాయి. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బందిని పిలిపించి బోట్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతునికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గాయపడిన యువకుడు..

పెద్దముడియం : మండలంలోని కొత్తపల్లె గ్రామంలో ఇంటిపై నుంచికింద పడి చికిత్స పొందుతున్న కిరణ్ (30)అనే యువకుడు శనివారం మృతి చెందాడు. జమ్మలమడుగు పట్టణంలోని దిగువపట్నం కాలనీకి చెందిన కిరణ్ ఈ నెల 27న జె.కొత్తపల్లె గ్రామంలోని జయమ్మకు చెందిన ఇంటిపై వెల్డింగ్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో సీఐ అర్జున్ నాయక్ మృతి

కడప అర్బన్ : కడపలోని పోలీస్ కంట్రోల్ రూం విభాగంలో సీఐగా పనిచేస్తున్న అర్జున్ నాయక్ శనివారం గుండెపోటుతో మృతి చెందారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఈయన జిల్లాలోని పలు స్టేషన్‌లలో, విభాగాల్లో ఎస్ఐగా, సీఐగా విధులను నిర్వహించారు. మృతదేహాన్ని శ్రీ సత్యసాయి జిల్లాలోని ఆయన స్వగ్రామానికి తరలించారు.

మృతదేహానికి ఘన నివాళి

పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్‌లతో పాటు పలువురు అర్జున్ నాయక్ మృతదేహాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

గండిలో కొబ్బరి కాయల టెండర్లు వాయిదా



గండిలో టెండర్లు నిర్వహిస్తున్న అధికారులు

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో శనివారం జరగాల్సిన కొబ్బరి కాయల టెండర్లు వాయిదా పడ్డాయి. ఎన్నడూ లేని విధంగా జీఎస్టీ అంశాన్ని తెర పైకి తేవడంతో ఆలయ అధికారి వెంకటసుబ్బయ్య తీరును నిరసిస్తూ టెండరుదారులు తమ డిపాజిట్లు వెనక్కు తీసుకొని వెళ్లిపోయారు. దీంతో టెండర్లు వాయిదా వేసినట్లు ఆలయ అధికారి తెలిపారు. గండి ఆలయంలో కొబ్బరి కాయల టెండర్ల విషయం తెలుసుకొని పలు ప్రాంతాల నుంచి 10 మంది వచ్చి ఒక్కొక్కరు రు.10 లక్షల చొప్పున డిపాజిట్ చెల్లించారు. 18 శాతం జీఎస్టీని టెండరు దక్కించుకున్నవారు చెల్లించాలని ఆలయ అధికారి పేర్కొనడంతో టెండరు దారులు అవాక్కయ్యారు. ఈ విషయాన్ని టెండరు ప్రకటనలో ముందుగా ఎందుకు తెలపలేదని వారు ప్రశ్నించారు. తాము కొబ్బరి కాయలు కొనుగోలు చేసిన చోట జీఎస్టీ చెల్లిస్తామని, తిరిగి ఇక్కడ కూడా జీఎస్టీ చెల్లించాలంటే ఎలా అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై విలేకరులు ఆలయ అధికారి వెంకట సుబ్బయ్యను వివరణ కోరగా కొబ్బరి కాయలు కొన్నచోటు నుంచి జీఎస్టీ చెల్లించిన బిల్లులు తీసుకొచ్చి ఇన్‌కంట్యాక్స్ చూపి క్లెయిమ్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ విషయంపై వారికి అవగాహన లేక అలా మాట్లాడుతున్నారని చెప్పారు. మళ్లీ ఎప్పుడు టెండర్లు నిర్వహించేది వెల్లడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, దేవదాయశాఖ కడప ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఆలయ ప్రధాన అర్చకుడు కేసరి, సూపరింటెండెంట్ షరీఫ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. టెండర్ల సందర్భంగా ఆర్కేవ్యాలీ ఎస్ఐ భాస్కర్ రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేయించాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు

కడప అగ్రికల్చర్ : పెంపుడు కుక్కలకు తమ యజమానులు తప్పని సరిగా రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు సూచించారు. వరల్డ్ రేబిస్ డే ను పురస్కరించుకుని శనివారం కడప నాగరాజుపేటలోని మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ ఈ రేబిస్ వ్యాక్సిన్ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉందని తెలిపారు. ఈ వ్యాక్సిన్ ఉచితంగా ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ కవితా సుధారాణి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమేష్, ఆర్‌బీఎస్‌కే ఎండీ ఖాజామొహిద్దీన్, ఎపడమాలజిస్టు, హెడ్ నర్స్ కవిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీధి కుక్కలకు వ్యాక్సినేషన్



వీధి కుక్కలకు టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

కడప అగ్రికల్చర్ : ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా వ్యాప్తంగా వీధి కుక్కలకు పశుసంవర్ధశాఖ ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 226 వీధి కుక్కలకు టీకాలు వేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ లీలాస్వర్ణ, కార్పొరేషన్ కమిషనర్ నందకిషోర్, పాలిక్లినిక్ ఏడీలు డాక్టర్ సుబ్బరాయుడు, డాక్టర్ నేతాజీ, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ శ్రీధర్ లింగారెడ్డి, డాక్టర్ సంధ్యా, డాక్టర్ మాధవి, జేఈఓ రాజశేఖర్, వీఎల్ఓ శివలక్ష్మి, నాయక్, సిబ్బంది రమేష్, అశోక్ తదితరులు తెలిపారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలకు విశేష స్పందన



జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో శనివారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో నిర్వహించిన ఈ ఎంపికలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ వైఎస్ఆర్ జిల్లా అధ్యక్షుడు బి. శివశంకర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం 100 మీటర్ల పరుగు పందెం, 200 మీటర్లు, 400 మీటర్లు, 600 మీటర్లు, 800 మీటర్లు, 1500 మీటర్లు, 3 కి.మీ విభాగంలో పోటీలు నిర్వహించారు. షాట్‌పుట్, జావెలిన్ త్రో, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, పోల్ వాల్ట్, హ్యామర్ త్రో విభాగాల్లో ఎంపికలు నిర్వహించి జిల్లా జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నాడు-నేడు పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నాడు -నేడు పెండింగ్ పనుల కొనసాగింపునకు ఆమోదం పొంది పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే మంజూరు చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ సి. వి. ప్రసాద్, కడప అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, ఆలీఖాన్, చెంగలరెడ్డి, ఉమాకాంత్ కోరారు. పాఠశాలల్లో మౌలిక వసతులపై దృష్టి పెట్టాలంటూ విద్యాశాఖ మంత్రి అధికారులను ఆదేశించడంపై ఆగిపోయిన పనులకు పరిష్కార మార్గం చూపుతారని ఆశిస్తున్నామని తెలిపారు. అలాగే ఉన్నత పాఠశాలలకు నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రొద్దుటూరులో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు

కడప అగ్రికల్చర్ : జిల్లాలోని రైతులు, కౌలు రైతులకు సంబంధించిన పత్తిని కొనుగోలు చేసేందుకు ప్రొద్దటూరులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మార్కెటింగ్ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు రామాంజనేయులు తెలిపారు. పత్తి పంటకు కనీస మద్దతు ధర పొడుగు గింజ క్వింటాల్ రూ. 7521 కాగా పొట్టి గింజ రూ. 7121గా ధర ఉందని తెలిపారు. రైతులు తమ పత్తిని బాగా ఆరబెట్టి దుమ్ము, ధూళి లేకుండా శుభ్రపరిచి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. పత్తికి ప్లాస్టిక్ సంచులను వినియోగించరాదని తెలిపారు. పత్తికి కనీస మద్దతు ధర రావాలంటే పత్తి గింజ పొడవు 29.30 ఎంఎం నుంచి 30.50 ఎంఎం వరకు ఉండాలన్నారు. రైతులు తమ ఆధార్ కార్డు జిరాక్స్, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్ తీసుకుని సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

పర్యాటక అవార్డు అందుకున్న బాలగొండ గంగాధర్



పర్యాటక ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకుంటున్న బాలగొండ గంగాధర్

కడప కల్చరల్ : రాష్ట్ర పర్యాటకశాఖ నుంచి 2024 సంవత్సరానికి ఉత్తమ పర్యాటక రచయితగా కడపకు చెందిన చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకున్నారు. శుక్రవారం రాత్రి విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ప్రత్యేక సభలో ఆయన రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ ద్వారా ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ గౌరవ అతిథిగా హాజరయ్యారు. గంగాధర్‌కు అవార్డు దక్కడం పట్ల జిల్లాకు చెందిన పలువురు పర్యాటకాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

గంజాయి విక్రేత అరెస్టు



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీఐ రోషన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి

కమలాపురం : పట్టణ పరిధిలోని దర్గా వీధికి చెందిన ఎస్. నాగార్జున సాగర్ గంజాయి విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు సీఐ ఎస్‌కే రోషన్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశంలో ఆయన అరెస్టుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో చెరువు కట్ట సమీపంలోని సుంకులమ్మ ఆలయం వద్ద నాగార్జున సాగర్ అనే వ్యక్తి గంజాయిని విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి సిబ్బందితో దాడి నిర్వహించినట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 1100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగూ మరో ఇద్దరిపై కేసు నమోదు చేశామని తెలిపారు. సాగర్‌పై కడప చిన్న చౌక్, మైదుకూరు పోలీస్ స్టేషన్లలో కూడా గంజాయి కేసులు ఉన్నాయని, బెయిల్‌పై వచ్చిన తర్వాత కూడా తన ప్రవర్తన మార్చుకోలేదని వివరించారు. ఈ సమావేశంలో ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.